కంకర తేలి.. అధ్వానంగా మారి

చేర్యాల గడితోట రహదారిపై ప్రయాణం నరకప్రాయం

చేర్యాల, మే 30: అసలే కంకర తేలిన రోడ్డు... ఆపై పెద్దపెద్ద గుంతలు... ఇలాంటి రోడ్లపై తాము ఎలా ప్రయాణించాలని చేర్యాల పట్టణ శివారు గడితోట, మండలంలోని చుంచనకోట గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్లకు ప్రాధాన్యతనిచ్చి నిర్మించగా, కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్ల నిర్మాణం, మరమ్మతులపై నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపిస్తున్నారు. పట్టణ శివారు గడితోటకు వెళ్లే రోడ్డు అస్తవ్యస్తంగా తయారై నడవడానికి వీలులేకుండా అధ్వాన్నంగా మారింది. గడితోటతో పాటు పట్టణానికి చెందిన రైతులు ఇదే రోడ్డున వెళ్లి తమ వ్యవసాయ పనులు చేసుకుంటారు. అన్నివర్గాల ప్రజలకు ఉపయోగపడే ఈ రెండు కిలోమీటర్ల బీటీ రోడ్డు మొత్తం కంకర తేలి ప్రయాణానికి సంకటంగా మారింది. రోడ్డుపై ఉన్న కల్వర్టుల వద్ద పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

కంకరతేలి అధ్వాన్నంగా తయారైన రోడ్డు (ఇన్‌సెట్లో రోడ్డుపై ఏర్పడిన గుంత)

బాలుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

బాలుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, మే 30: మండలంలోని అల్వాలలో గురువారం బీడ కనకయ్య-లావణ్య దంపతుల చిన్న కుమారుడు నికాస్ ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి రోటవేటర్ కిందపడి మృతిచెందిన విషయం విధితమే. శుక్రవారం విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి.. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాలుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వారి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, మాజీ సర్పంచ్ బాల్‌రాజు, బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు లింగం, నాయకులు అహ్మద్, రాజయ్య, నితిన్ ఉన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన కర్ర శ్రీహరి

బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న శ్రీహరి

కోహెడ, మే 30: మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన మంథని వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు బొబ్బల కొండాల్‌రెడ్డి, కక్కెర్ల ప్రర్శరాములు, కక్కెర్ల వేణుగోపాల్, మంథని బాలయ్య, కొమిరె తిరుపతి, మంథని రవి, గుర్రం ధశరథం, కొంగ లక్ష్మణ్ , జేరిపోతుల దేవేందర్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలి

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

సిద్దిపేట, మే 30: వర్షకాలం సమీపిస్తున్నందున పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు సూచించారు. శుక్రవారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎజెండాలోని 13 అంశాలకు పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు తమతమ వార్డులలో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పెండింగ్‌లో ఉన్న శిల్పారామం పనులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో హరితహారం చెట్లను నరకవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ సూచించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, పాలకవర్గ సభ్యులు లక్ష్మణ్, వినోద్‌గౌడ్, యోగేశ్వర్, సుందర్, మల్లికార్జున్, అరవింద్‌రెడ్డి, నాగరాజురెడ్డి ప్రవీణ్ కుమార్, భాగ్యలక్ష్మి శ్రీనివాస్, సంధ్యా శ్రీకాంత్, దీప్తి నాగరాజు, పూర్ణిమ ఎల్లం, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్, సత్తయ్య పాల్గొన్నారు.

ఆర్వీఎంలో ఇంటర్నేషనల్ షోల్డర్ కోర్స్ వర్క్‌షాప్

- పాల్గొన్న అంతర్జాతీయ వైద్యులు

వర్క్‌షాప్‌లో పాల్గొన్న అంతర్జాతీయ వైద్యులు

ములుగు, మే 30: ఆర్వీఎం మెడికల్ కళాశాల, వైద్యశాలలో అంతర్జాతీయ స్థాయి శోల్డర్‌కోర్స్ వర్క్‌షాప్‌ను నిర్వహించి వైద్యులకు అవగాహన కల్పించారు. ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం మెడికల్ కళాశాల, వైద్యశాలలో శుక్రవారం హైదరాబాద్ షోల్డర్ కోర్స్-2025లో భాగంగా వర్క్‌షాప్‌ను కళాశాల చైర్మన్ డాక్టర్ యాకయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు పాల్గొన్న ఈ వర్క్‌షాప్‌లో మరమ్మత్తు చేయలేని 'రోటేటర్ కఫ్ టియర్' అనే ప్రత్యేక థీమ్ గురించి అవగాహన కల్పించారు. దీంతో పాటు త్రీడి సిమ్యులేటర్, ఆర్ఎస్ఏ సా బోన్ థీమ్‌లు వర్క్‌షాప్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో సీఈవో శ్రీనివాస్‌రావు, డీన్ శ్రవణ్‌కుమార్, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, డైరెక్టర్ గోపికృష్ణ, జాతీయ, అంతర్జాతీయ వైద్య నిపుణులు పాల్గొన్నారు.

జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలి

- పీస్ డైరెక్టర్ నిమ్మయ్య

జగదేవపూర్, మే 30: జీవ వైవిధ్యాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ నడుం బిగిస్తూ పాత సంప్రదాయ పంటలను పోత్సాహించాలని పీస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య, ఉపాధ్యక్షురాలు అరుణ సూచించారు. శుక్రవారం మండలంలోని పీస్ కార్యాయలంలో జీవ వైవిధ్య పాత పంటల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవవైవిధ్యం విశిష్టతను అందరూ తెసుకోవాలన్నారు. భూమిలో అనేక జీవ రాశులు పంటల రక్షణకు ఉపయోగపడుతాయని, కానీ నేడు అధిక దిగుబడుల కోసం ఎగబడుతూ మితిమీరిన రసాయన ఎరువుల వాడకంతో జీవవైవిధ్యం దెబ్బతింటుందన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మహిళలు, పీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అపూర్వ కలయిక..

కొమురవెల్లి, మే 30: కొమురవెల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005-06 విద్యా సంవత్సరం పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు శోభన్‌బాబు, లక్ష్మారెడ్డి, హైమాన్, తిరుపతయ్య, మల్లారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రాములు, రంగనాథ్‌తో పాటు పూర్వ విద్యార్థులు కొండ శ్రీధర్, లింగంపల్లి కనకరాజు, సిలివేరు మల్లేశం, కొంక మహేశ్, కవిత, నాగరాణి పాల్గొన్నారు.

రక్తపోటుపై ప్రజలకు అవగాహన

జగదేవపూర్, మే 30: మే 17 నుండి జూన్ 16 వరకు మండలంలోని ఆయా గ్రామాలలో రక్తపోటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సత్యప్రకాశ్ తెలిపారు. శుక్రవారం జగదేవ్‌పూర్ పీహెచ్‌సీలో ఘనంగా ప్రపంచ రక్తపోటు దినం నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి పోలీస్ స్టేషన్ వరకు నడక ర్యాలీ నిర్వహించారు. నడక ద్వా రా రక్తపోటు తగ్గుతుందన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది దయాకర్‌రెడ్డి, అమర రాము పాల్గొన్నారు.

పంటలకు రసాయనాల వాడకం తగ్గించాలి

నారాయణరావుపేట: మాట్లాడుతున్న అధికారులు, శాస్త్రవేత్తలు

నారాయణరావుపేటలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ, ఎస్సై

నారాయణరావుపేట, మే 30: యూరియా, రసాయనాల వాడకం తగ్గించి పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తోర్నాల వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీదేవి, ఏడీఏ పద్మ సూచించారు. మండల కేంద్రమైన నారాయణరావుపేటలోని రైతువేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... రైతులు తప్పకుండా పంట మార్పిడి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ పరుశరాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నారాయణరావుపేటలో...

నారాయణరావుపేట, మే 30: మండల కేంద్రమైన నారాయణరావుపేటలో ఏఓ పరశురాం.. సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వతో కలిసి శుక్రవారం ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణదారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని వారు హెచ్చరించారు. వారి వెంట ఏఈఓ వరుణ్ ఉన్నారు.

సేంద్రియ ఎరువులనే వాడాలి

మర్కూక్, మే 30: కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అద్వర్యంలో వికసిత సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిపుణులైన శాస్త్రవేత్తలతో 15 రోజుల పాటు రైతులకు అవగాహన కల్పిస్తున్నామని శాస్త్రవేత్తలు రామానాయుడు, శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చేబర్తిలో రైతులకు పంట సాగుపై అవగాహన కల్పించారు.

అంగడిలో దోపిడీని అరికట్టాలి

- బీఆర్ఎస్ నాయకులు, రైతులు, వ్యాపారుల రాస్తారోకో

రాస్తారోకోలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు, వ్యాపారులు

హుస్నాబాద్‌టౌన్, మే 30: మండల కేంద్రమైన హుస్నాబాద్‌లో ప్రతివారం జరిగే అంగడిలో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నాడాయన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి పట్టణంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అంగడిలో మున్సిపల్ నిర్ణయించిన దానికంటే కాంట్రాక్టర్ రైతులు, వ్యాపారస్తుల నుంచి అధికంగా రుసుము వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్‌కు జరుగుతున్న దోపిడీని వివరించినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోలో సీపీఎం హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గుగులోతు శివరాజ్, మాజీ కౌన్సిలర్ ఇంద్రాల సారయ్య, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు మేకల వికాస్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాకాల శ్యాంసుందర్ గౌడ్, గోపగాని అరవింద్‌గౌడ్ ఉన్నారు.

రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిన కేంద్రం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్‌టౌన్, మే 30: ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరినా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. న్యాయ విచారణ జరపాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లకు అర్హులు కాదని, పేదలు, బడుగు బలహీన వర్గాలకు చెందినవారికి ఇండ్లు దక్కాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, హుస్నాబాద్ మండల కార్యదర్శి గడిపె మల్లేశ్, అక్కన్నపేట మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జెరిపోతుల జనార్ధన్, సీపీఐ నాయకులు ఎడల వనేష్, మాడిశెట్టి శ్రీధర్, అయిలేని మల్లారెడ్డి, సంజీవరెడ్డి, ఎగ్గోజు సుదర్శన చారి, గూడ పద్మ, నిర్మల, జమున ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

చేర్యాల, మే 30: పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో 11వ మహాసభ నిర్వహించారు. అశోక్ మాట్లాడుతూ మున్సిపాలిటీతో పాటు పరిసర గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంపై, అధికారులపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. అనంతరం పట్టణ కార్యదర్శిగా మమత, సహాయ కార్యదర్శిగా రజిత, కార్యవర్గ సభ్యులు రవి, హరిప్రసాద్, రాజు, సురేందర్, అశోక్, నర్సయ్య, కనకయ్య, యాదగిరి, యాదగిరి, పరమేశ్, నాగరాజు, రవి, మురళి, సిద్దులు, రాకేశ్, కిరణ్‌ను ఎన్నుకున్నారు. అలాగే మండలంలోని ముస్త్యాలలో 10వ మహాసభ జరిగింది. నాయకులు కృష్ణ, భూమయ్య, యాదగిరి, నంగి కనకయ్య పాల్గొన్నారు.

చామలా.. ఇచ్చిన హామీని నెరవేర్చాలి: అముదాల

చేర్యాల, మే 30: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తాను ఎంపీగా గెలిచిన వెంటనే చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయిస్తానని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ఆరోపించారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల ప్రాంతానికి ఆర్నెళ్లకు ఒకసారిరాని భువనగిరి ఎంపీ చామల చేర్యాల ప్రాంత వ్యతిరేకి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కార్యక్రమాలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. చేర్యాల ప్రాంతంలో ఇందిరమ్మ ఇండ్లలో అవినీతికి పాల్పడుతూ అర్హులైన వారికి ఇండ్లు కేటాయించకుండా కమిషన్‌లు ఇచ్చేవారికి మాత్రమే ఇల్లు కేటాయిస్తున్నట్లు ఆరోపించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్‌మావో, మండల, పట్టణ కార్యదర్శులు అరుణ్‌కుమార్, నాగరాజు, నాయకులు శ్రీహరి, ప్రభాకర్, మల్లేశం, రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాలంచెల్లిన విత్తనాలు విక్రయించొద్దు

మిరుదొడ్డి: అక్బర్‌పేట-భూంపల్లిలో తనిఖీలు చేస్తున్న ఏవో, ఎస్సై

సిద్దిపేట టౌన్: విత్తనాల దుకాణంలో తనిఖీ చేస్తున్న సీఐ ఉపేందర్

రాయపోల్, మే 30: విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని గజ్వేల్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు బాబునాయక్, మండల ఏఎస్ఐ రాజు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని విత్తన డీలర్ల దుకాణాలను, ఆగ్రో రైతు సేవా కేంద్రంను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ టీమ్ తనిఖీ చేసింది. అనంతరం మండల పరిధిలోని విత్తన డీలర్లందరికీ స్థానిక రైతువేదికలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాబునాయక్, రాజు మాట్లాడుతూ ప్రతీ రైతుకు ప్రతీ డీలర్ కచ్చితంగా కొనుగోలు బిల్లు ఇవ్వాలని సూచించారు. రేటుకు మించి, కాలం గడిచిన విత్తనాలు, పురుగు మందులు విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏవో నరేశ్, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే ఎవ్వరినీ సహించం

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), మే 30 రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే ఎరువుల దుకాణాల యజమానులపై చర్యలు తీసుకుంటామని అక్బర్‌పేట-భూంపల్లి మండల ఏవో సత్యాన్వేష్, ఎస్సై హరీశ్ హెచ్చరించారు. శుక్రవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంతో అనుమతి పొందిన విత్తనాలను రైతులకు విక్రయించాలని సూచించారు. ఎవరైనా నకిలీ విత్తనాలను విక్రయిస్తే రైతులు అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవోలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

సిద్దిపేట టౌన్, మే 30: నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు విక్రయించి రైతులను మోసం చేయాలని చూస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ హెచ్చరించారు. శుక్రవారం సర్కిల్ పరిధిలోని విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా దుకాణదారుడి దగ్గరి నుంచి రసీదు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి శ్రీనాథ్, ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు

– మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

మాట్లాడుతున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్‌టౌన్, మే 30: పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే విషయంలో ఏమాత్రం అవినీతికి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని బీసీ సంక్షేమం, రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. హుస్నాబాద్ ఆర్డీఓ, మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇండ్లపట్టాలను మంజూరు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంల్లో కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ఆర్డీవో రామ్మూర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

మాకు ఇండ్లు రాలేదు.. మంత్రికి ఫిర్యాదు

తమకు అర్హత ఉన్నా ఇందిరమ్మ ఇండ్లు రాలేదంటూ పలువురు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక 1, 19 వ వార్డులకు చెందిన పలువురు తమకు అర్హత ఉన్నా అధికారులు ఇండ్లు ఇవ్వలేదని, ఇస్తామని చెప్పి తీరా ఇక్కడ ఇవ్వలేదంటూ వారు తమ ఆవేదనను వినిపించారు. దీనిపై విచారణ జరిపి అర్హులైనవారికి ఇండ్లు ఇప్పించేందుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

పోలీసులు ప్రజల మన్ననలు పొందాలి

మిరుదొడ్డి, మే 30: ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీస్ సిబ్బంది విధులను నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని సీపీ అనురాధ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన తొగుట పోలీస్ స్టేషన్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. పోలీస్ సిబ్బంది ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని పోలీసులకు సీపీ సూచించారు. స్టేషన్‌లో రికార్డులు సీసీటీఎన్ఎస్ డాటా అప్‌డేట్‌గా ఉండడం వల్ల అధికారులను, సిబ్బంది సీపీ అభినందించారు. సీపీ వెంట గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, తొగుట సీఐ లతీఫ్, ఎస్సై రవికాంతరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించాలి

బెజ్జంకి, మే 30: గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించాలని డీపీవో దేవకిదేవీ అధికారులకు సూచించారు. మండలంలోని వడ్లూర్, బేగంపేట గ్రామాల్లోని వననర్సరీలను ఆమె శుక్రవారం పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యదర్శులు ప్రతిరోజు ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అటెండెన్స్ నమోదు చేసుకోవాలని, మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో ప్రవీణ్, ఎంపీవో మంజుల, కార్యదర్శులు ఉన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సుల్తాన ఉమార్

గజ్వేల్, మే 30: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు సుల్తాన ఉమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం నాడామె ఆర్డీవో కార్యాలయంలో, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, నాయకులు రాజు, చంద్రకళ, నర్సన్న, బాల్‌రాజు, ప్రసాద్, దోమరాజు. రాజులు పాల్గొన్నారు.

నగల కోసం మహిళ దారుణ హత్య

బాల్‌లక్ష్మి (ఫైల్)

చిన్నకోడూరు, మే 30: నగల కోసం మహిళను పట్టపగలే గుర్తుతెలియని దుండగులు దారుణంగా హత్య చేశారు. ఘటన మండలంలోని కమ్మర్లపల్లిలో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గాలి బాల్‌లక్ష్మి (50) ఇంట్లో కిరాణాషాపు, ఆమె భర్త సుధాకర్ ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి కూతురు, కుమారుడు ఉండగా ఇద్దరి వివాహాలు జరిగాయి. కుమారుడు వెంకటేశ్ దంపతులు ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. సుధాకర్ దంపతులు గ్రామంలోనే ఉంటున్నారు. శుక్రవారం ఉదయం సుధాకర్ ఆటో తీసుకొని సిద్దిపేటకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంట్లో చొరబడి నిద్రిస్తున్న బాల్‌లక్ష్మిని వెంట తెచ్చుకున్న కత్తితో గొంతుకోయగా రక్తపు మడుగులో పడి మృతిచెందింది. ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణాలను తీసుకుని పారిపోయారు. సాయంత్రం భర్త సుధాకర్ ఇంటికి వచ్చి చూడగా భార్య రక్తపు మడుగులో పడి మృతిచెంది ఉండడంతో స్థానికులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్సై బాలకృష్ణ, ప్రొహిబీషన్ ఎస్సై సైఫ్‌అలీ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ రప్పించి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బంగారు ఆభరణాల కోసమే గుర్తుతెలియని దుండగులు మహిళను హత్య చేసి ఉంటారని ఎస్సై బాలకృష్ణ తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్

ఆయిల్‌పామ్ ఆవశ్యకత కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం, తదితరులు

హుస్నాబాద్‌రూరల్, మే 30: రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టిసారించి దీర్ఘకాలిక లాభాలు పొందాలని బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోతారం(ఎస్)లో రైతులకు ఆయిల్‌పామ్ సాగు, విస్తరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలకు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టాలు జరుగుతాయి కానీ ఆయిల్‌పామ్ సాగులో ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. జూన్‌లో హుస్నాబాద్‌లోని మార్కెట్ యార్డులో రాష్ట్రస్థాయి వ్యవసాయ యంత్రాల ప్రదర్శన, వ్యవసాయ సాంకేతిక అవగాహన సదస్సులు ఉంటాయని, రైతులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఆయిల్‌పామ్ సాగు ఆవశ్యకతపై రూపొందించిన కరపత్రాన్ని మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్, తెలంగాణ ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగ రాఘవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం ఇల్లు నిర్మించుకోవాలి

కోహెడ, మే 30: ప్రభుత్వం ఇచ్చిన కొలతల ప్రకారం ఇల్లు నిర్మించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మండల కేంద్రమైన కోహెడలో నిర్మించిన ఇందిరమ్మ నమూన ఇల్లును కలెక్టర్ మనుచౌదరితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్ల మంజూరీ ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమాలలో అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్, హౌసింగ్ పీడీ దామోదర్‌రావు, సివిల్ సప్లై ఈడీ ప్రవీణ్, ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ ఆహ్మద్ ఖాన్, గ్రంథాలయాల కమిటీ చైర్మన్, లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మల జయరాజ్, వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ధర్మయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

రాయపోల్, మే 30: ప్రతి ఉపాధ్యాయుడు బడిబాటలో పాల్గొని విద్యార్థులందరూ ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ బడి అంటే ఇష్టపడేలా అవగాహన కల్పించాలని ఎంఈవో సత్యనారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు యాదగిరి, స్వామి, ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

దోస్త్ రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

సిద్దిపేట టౌన్, మే 30: తెలంగాణలో వివిధ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ పొందుటకు రూపొందించిన దోస్త్ రెండవ విడత అడ్మిషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైందని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సునీత తెలిపారు. మొదటి విడతలో రిజిస్ట్రేషన్ చేయని విద్యార్థులు రెండవ విడత జూన్ 8 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్ ఆప్షన్స్ మే 30 నుండి జూన్ 9 వరకు ఇవ్వవచ్చని, వీరికి 13న సీట్లను కేటాయిస్తామన్నారు. రెండవ విడతలో సీట్లు పొందిన వారికి జూన్ 13 నుండి 18 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. చివరగా అన్ని విడతల్లో ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేసినవారు జూన్ 24 నుండి 28 వరకు కళాశాలలో ధ్రువపత్రాలను సమర్పించాలని చెప్పారు. ఇప్పటికే మొదటి విడతలో సీట్లు పొందినవారు జూన్ 6 వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టు తప్పనిసరి చేయాలని సూచించారు.

పౌరహక్కులపై అవగాహన

చేర్యాల, మే 30: మండలంలోని శభాష్ గూడెంలో పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రాజ్యాంగం ప్రజలకు కల్పించిన పౌరహక్కులను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కొమురవెల్లి ఎస్ఐ రాజు, చేర్యాల ఆర్ఐ అయిలయ్య, గ్రామ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, ఆశవర్కర్, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

చేర్యాల, మే 30: అన్ని వర్గాల ప్రజలు తమతమ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ శ్రీను కోరారు. చేర్యాల పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం సీఐ శ్రీను, ఎస్ఐ నిరేష్ మండలంలోని వివిధ గ్రామాల కుల, మత సంఘాల ప్రతినిధులు, బీజేపీ, బీజేవైఎం, హిందూవాహిని సభ్యులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. గోవుల అక్రమ రవాణా అరికట్టడడంతో పాటు వాటిని వధించకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పీస్ కమిటీ సభ్యులకు ఎలాంటి సమాచారం వచ్చిన పోలీసులకు తెలియజేయాలని, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దన్నారు.

విద్యార్థులపై వివక్ష తగదు

సిద్దిపేట టౌన్, మే 30: గురుకుల పాఠశాల సెక్రటరీ అలుగు వర్షిణి విద్యార్థులపై చేసిన అనుచిత వాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ మాల మహానాడు సిద్దిపేట జిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు కొదాది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నాడాయన సిద్దిపేటలో మాట్లాడారు. వర్షిణి తన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నేతలు మహేందర్, శంకర్, రవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కొమురవెల్లి, మే 30: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని కిష్టంపేట శివారులో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నంగునూరు మండలంలోని పాలమాకులకు చెందిన రంగు రాహుల్ (25), తన స్నేహితుడు గడ్డం అజయ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై శుక్రవారం ఉదయం కొమురవెల్లి మల్లికార్జునస్వామిని దర్శించుకొని తిరిగి పాలమాకులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కిష్టంపేట గ్రామశివారులో ఎదురుగా వస్తున్న అశోక్ లేలాండ్ గూడ్స్ వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాహుల్‌తో పాటు అజయ్‌ను 108 అంబులెన్స్‌లో చేర్యాలలోని ప్రైవేటు దవఖానకు తరలించగా చికిత్స పొందుతూ రాహుల్ మృతిచెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బెజ్జంకి క్రాసింగ్‌లో బాలుడు..

బెజ్జంకి, మే 30: మండలంలోని బెజ్జంకి క్రాసింగ్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందినట్లు ఏఎస్ఐ శంకర్‌రావు తెలిపారు. ఆయన కథనం మేరకు.. చిగురుమామిడి మండలంలోని నవాబ్‌పేటకు చెందిన గూళ్ల శ్రీకాంత్, కల్యాణిల కుమారుడు రక్షిత్(7) ముగ్గురు బైక్‌పై బెజ్జంకిలోని బంధువు శ్రీనివాస్ ఇంటికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బెజ్జంకి క్రాసింగ్ శివారులో శ్రీకాంత్ నడుపుతున్న బైక్‌ను హైదరాబాద్ నుండి కరీంనగర్ వెళ్తున్న నలుపురంగు కారు వెనుక నుండి ఢీకొట్టింది. దీంతో రక్షిత్ డివైడర్‌పై పడటంతో అక్కడిక్కడే మృతిచెందాడు. శ్రీకాంత్, కల్యాణిలకు గాయాలు కాగా, అంబులెన్స్‌లో కరీంనగర్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఏఎస్ఐ వివరించారు. శ్రీకాంత్ బంధువు గూళ్ల రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.